# మృత్యువు

సన్నటి తుంపర నగర వీధుల్ని తడుపుతూంది.

గత మూడు రోజులుగా ఇదే వరస....

మానవుడు జీవితంలో ఇష్టపడని విషయాల్లో 'ముసురు' కూడా ఒకటేమో!

నేను ఆఫీస్ పని మీద భాగ్యనగరం రావటం జరిగింది. అయినా నాకు కొన్ని వ్యక్తిగతమైన పనులు లేకపోలేదు. ఈ ముసురు నన్నెంత ఇబ్బందికి గురి చేసిందంటే, ఇంత వరకూ ఒక్క పని పూర్తి కాలేదు.

నాకిలాంటి వాతావరణంలో రకరకాల ప్రేరణలు కలుగుతుంటాయి. నేను బాల్యంలోకి జారిపోతాను. ఓ రకమైన తాత్విక ధోరణి నా అణువణువూ నిండిపోతుంది. ఇలాంటి వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేది కొందరికేనేమో! నులివెచ్చని రగ్గుల క్రింద వారు సమయాన్ని చంపేయగలరు. కడుపులో కాళ్ళు ముడుచుకునేవారు మాత్రం ఎండ కోసం ఎదురు చూస్తుంటారు.

ఈ ముసురు ఎంత పాశవికమైనదంటే, మూడురోజులుగా కురుస్తున్న వానకు ఓ ఇల్లు నాని కూలిపోవటంతో అయిదు సంవత్సరాల పాపతో సహా ఓ కుటుంబం దుర్మరణం పాలయింది.

పేపర్లో ఈ వార్త చదువుతుంటే. ఆ భయానక దృశ్యాల్ని చూస్తుంటే నాకీ వర్షం మీదే ద్వేషం కలుగుతుంది. పంటలకు మూలాధారమైనా ఈ వర్షం, నిత్యజీవితంలో తప్పనిసరి అయిన ఈ వానే ప్రాణాల్ని తీయటం ఎంత బాధాకరం!

అయినా మృత్యువు ఎంత కర్కశమైనది! అది ఏ రూపంలో ఏ క్షణాల్లో విరుచుకుపడుతుందో ఎవరు చెప్పగలరు? అసలు మృత్యువు అంటే ఏమిటి?

నా ముందు బిగించబడ్డ అద్దాలు. నగర వీధులవెంట నీళ్ళు పారుతున్నాయి. వాటిని విరజిమ్ముకుంటూ ఆటోలూ, స్కూటర్లు పరిగెడుతున్నాయి. శరీరాలమీద రెయిన్‌కోట్లు, తలమీద హాట్లు ధరించిన యువతీ, యువకులు ముసురును లక్ష్యపెట్టడం లేదు.

అప్పుడప్పుడూ ఓ రిక్షను భారంగా ఈడ్చుకెళ్తున్నారు కొందరు... అక్కడక్కడా ఎదిగి ఉన్న చెట్లు కన్నీరు కారుస్తున్నాయా అనిపిస్తూంది. కార్పొరేషన్ వారి లైట్లు కొన్నింకా గుడ్డిగా వెలుగుతున్నాయి.

ఎవరి ప్రపంచంలో వారున్నారు.

నేను అద్దాల నుండి ముసుర్ని చూస్తున్నా .... జీవితాన్ని చూస్తున్నా....

నా వెనకాల వైపు రైటర్ మీద శరవేగంగా వ్రేళ్ళు కదుపుతున్నాడు భార్గవ. నాకు కొంచెం ప్రక్కగా పెద్ద పుస్తకంలో ఎంట్రీలు వేస్తుంది శోభ.

ఏది ఆగటం లేదు. అలాగని అంతా సజావుగా ఉందనిపించటం లేదు. నన్నింకా ఆ పేపరు వార్తే కలవరపెడుతూంది. వీరెవరికీ ఈ విషయం పట్టడం లేదు. మృత్యువు సహజమన్నంతగా పరిణితి చెందారా వీళ్ళు!

సమయం గడిచి, సాయంకాలమైతే, తిరిగి బస్సులు, నెట్టుకోవడాలు, ఇంటికి వెళ్ళటం, స్నానం, భోజనం, రోటీన్, రొటీన్, యాంత్రికత, జీవనం కోసం వెంపర్లాట....ఏమిటో ఎంతగా మారిపోతున్నాం మనం! ఇదంతా వేగమేనా? ఇదంతా అభివృద్దేనా? ఇదంతా....

భార్గవ వచ్చాడు.

ఏమిటాలోచిస్తున్నావు? అడిగాడు.

"ఏముంది ముసురు గురించి. మృత్యువు గురించి"

"మృత్యువా?" అన్నాడు ఎందుకో అసహనంగా

'అవునూ....మృత్యువంటే గుర్తొచ్చింది. శివ వాళ్ళ నాన్నను నిన్న హాస్పటల్లో చేర్పించారు.'

....ఎందుకు? ఏమైంది? ప్రశ్నించాను.

"నిన్న సాయంకాలం దాకా బాగున్నాడు. ఏడుగంటల కల్లా భోంచేశాడు. ఎనిమిదింటికి కడుపులో నొప్పిగా ఉందన్నాడట. వెంటనే దగ్గరున్న హాస్పటల్‌కు తీసుకెళ్ళారు. మా వల్ల కాదు జనరల్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళమన్నారు. వాడు ఉదయం ఫోన్ చేశాడు. సాయంకాలం దాటితే గండం గడిచినట్లు" అన్నాడు భార్గవ.

....ఇంతకూ ఏమయింది?

అదే చెప్పలేకపోతున్నారు. రాత్రి నుండి సెలైన్‌బాటిల్స్ ఎక్కిస్తున్నారు. వాడు ఒక్కగానొక్క కొడుకు. ఇలాంటి అనుభవాలు ఇంతకుముందు లేవు. ఆఫీస్ అవగానే అక్కడికి వెళ్ళాలి" అంటున్నాడు భార్గవ

ఫోన్ రింగవుతుంటే అటు చూశాం.

"మిస్టర్ బార్గవా" ఫోన్ అందించాడా మిత్రుడు.

వింటున్న భార్గవ మొఖంలో మారుతున్న భావాలు చూస్తుంటే నాలో తిరిగి ప్రకంపనలు....ఫోన్ పెట్టేసి వస్తున్నాడు భార్గవ నీరసంగా.

"ఎవరూ శివేనా ?"

"అవును"

"ఎలా ఉందట?"

"ఆయన చనిపోయారు!"

ఉస్మానియా హాస్పటల్ వైపుకు ఆటో పరిగెడుతూంది. మా వెన కాల మా ఆఫీసు ఉద్యోగులు వస్తున్నారు. నేను రేపు డ్యూటీలో జాయి నవ్వాలి. ఈసారి ఏ పనులూ కాలేదు. అందుకు కాదు నా బాధ....ఈ విషా దానుభవాల్ని మోసుకెళ్తున్నానే అని....

రాత్రి ఏడు గంటలదాకా బాగున్న మనిషి అంత త్వరగా మృత్యు వుకి బలికావటమా! అసలు మృత్యువు అంటే ఏమిటి ? భౌతికంగా మన నుండి వ్యక్తులు దూరమవటమేనా ?! మన కంటికి ఇంకెప్పుడూ ఆ వ్యక్తి సజీవంగా కనిపించడనే బాధాకరమైన వాస్తవమే మృత్యువా ? ఈ శరీరం మట్టిలో కలిసిపోయో, మంటల్లో ఆహుతయ్యో, పంచభూతాల్లో కలవట మేనా మృత్యువు ?

ఇదంత సహజమైనప్పుడు ఎందుకింత అసహజంగా విరుచుకు పడటం? బంధాల్ని, అనుబంధాల్ని, సర్వాన్ని క్షణాల్లో తెంపేసే ఈ మృత్యువు నుండి ఏనాటికైనా మనిషి విముక్తం కాగలడా ?

"ఆయన కనీసం బీడి ఎరగడు. ఏమిటో విచిత్రాలు జరుగుతుం టాయి. అయినా ఈ నగర జీవితమంతా క్లిష్టమైంది మరొకటి లేదు" అంటున్నాడు భార్గవ.

"నిజమేనా ? నగర జీవితం అంత క్లిష్టమైనదా?

అవును. మనం మృతువును గురించి అర్థం చేసుకోగలం. ఈ నగర జీవితాన్ని మాత్రం కాదు. అసలు ఒక్క నగర జీవితమనే ముందిలే మొత్తంగా జాతి జీవనమే అలా తయారైంది. కల్తీలేని రంగం ఏముందో చెప్పు. మందులు తీసుకుంటే అవి వికటించవచ్చు. మనం వాడే నూనెలో, పీల్చేగాలిలో... అణువణువూ నిండి ఉంది. మృత్యువు కాదూ ?"

ఎంత చక్కగా చెప్పాడు భార్గవ. జీవించటం కోసం మనిషి పడుతున్న ఈ ఆరాటంలో ఒక్క క్షణం ఆగి వెనక్కి చూసుకుంటే ఎంత బాగుంటుంది.

మృత్యువు ఎక్కడో లేదు. మన పరిసరాల్లో ఉంది. మన ఆలోచనల్లో ఉంది. మన ఆచరణలో, దృక్పథంలో ఉంది. నిజంగా మృత్యువును జయించాలంటే ముందు మనల్ని మనం సంస్కరించుకోవటంలో ఉంది. ఈ పరిస్థితుల్ని మనకు అనుకూలంగా మార్చుకోవటంలో ఉంది.

ఆటో ఆగింది.

మీటరుకేసి చూశాను.

"ఏక్ రూపియా బడకేదేవ్ సాబ్" అన్నాడతను.

భార్గవ నాకళ్ళలోకి చూశాడు.

ఈ సమాజంలో దేన్ని ఆపటం ఎవరితరం!

అందుకేగా మృతువు ఇంతగా వికటాట్టహాసం చేయటం! ఏ విలువల్ని శాసించగలమని మనం మృత్యువుతో పోరాడగలం ?!

వాకిట్లోనే ఎదురయ్యాడు శివ.

అతని కళ్ళు వాచి ఉన్నాయి. మమ్మల్ని చూడగానే తిరిగి ఒక్కసారిగా దుఃఖం పెల్లుబికింది. భార్గవ భుజాలమీద తల ఆనించి తన హృదయంలోని ఆవేదన తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఐదు నిమిషాలు గడిచాక తేరుకున్నాడు.

శవం ఇంకా బయటకు రాలేదు.

ఊర్కో శివా... మన చేతుల్లో ఏముంది? ఓదార్చాడు భార్గవ.

"అమ్మ పిలుస్తూంది" అంటూ వచ్చిందో యువతి.

శివ లోపలకి వెళ్ళాడు.

ఈ అమ్మాయి మాత్రమే పెళ్ళికి మిగిలింది. మిగిలిన వారందరూ సెటిలయ్యారు అన్నాడు భార్గవ.

భార్గవ చెప్పిన దాని ప్రకారం శివకు ఇద్దరు అక్కలు, ఓ చెల్లి ఉన్నారు. ఓ అక్క విజయవాడలో ఉంది. మరో అక్క హైదరాబాదు లోనే ఉంది. ఆయనో పెద్ద ఆఫీసరు. స్వంత ఇల్లు మంచి బ్యాంక్ బ్యాలన్స్ ఉంది.

అంతలోనే ఓ స్కూటర్ వచ్చి ఆగింది.

"వాళ్ళ బావగారు" అన్నాడు భార్గవ.

ఎర్రటి దేహం... విశాలమైన పాలభాగం... మంచి ఎత్తు... రెయిన్ కోటూ, హ్యాట్‌తో గంభీరంగా నడిచి వచ్చాడు. ఆయన వెనగ్గా శివ అక్క నసుచుకుంటూ వచ్చింది. ఆమె పమిటి కొంగు నోటి కడ్డంగా పెట్టుకొని లోపలకు వెళ్ళింది. అక్కడ పరిస్థితి అంతా విషాదకరంగా ఉంది.

మేం బయట నిలబడి ఉన్నాం. తెల్లటి బట్టలు ధరించిన నర్సులు అటూ ఇటూ తిరుగుతున్నారు. తెలంగాణా యాసతో కూడిన తెలుగూ, ఉర్దూలో అక్కడి వారంతా ధారాళంగా మాట్లాడుకుంటున్నారు. మా ముందే రెండు శవాలు బయటకొచ్చాయి.

వాటిని తీసుకొస్తున్నవారు అత్యంత యాంత్రికంగా కదులుచున్నారు

శివ బావగారు నిలబడి సిటరెట్ వెలిగించారు. ఆయన్నలా చూస్తుంటే నాకదో రకంగా ఉంది. ఈ సన్నివేశానికి ఆయన వాలకం యే మాత్రం సరిపోవటం లేదు. అంటే భయంకరంగా ఏడుస్తూ పెడ

బొబ్బలు పెట్టాలని కాదు. శవాన్ని బయటకు తెచ్చి విసిరి వేయటాన్ని అర్థం చేసుకొనవచ్చు కానీ...

భార్గవ వెళ్ళి నమస్కరించాడు.

"ఓ భార్గవా! రండి" అంటూ పలకరించాడు.

వారిద్దరూ మాట్లాడుకుంటున్నారు.

"ఇప్పుడేం చేద్దామని" అన్నాడు భార్గవ "చేసేదేముంది శవాన్ని డైరెక్టుగా శ్మశానానికి తీసుకు వెళ్ళటమే"

"ఈ వానలోనా"

"అవును. ఏం చేస్తాం. అద్దె ఇళ్ళలో శవాన్ని ఉంచటానికి ఎవరూ అంగీకరించరు."

"ఒక్క పూట కూడానా"

"ఒక్క పూట కాదు గంటయినా ఉంచరు."

"మరి అందరూ రావాలి కదా"

"శివ సిస్టర్ వాళ్ళు మార్నింగ్ వచ్చారు. రాత్రే యస్. టి. డి. చేశాం. ఇంకెవరో దూరపు బంధువులున్నారు. వారికోసం వేచి ఉండే అవకాశం లేదు.

భార్గవ మాట్లాడలేదు.

"అయినా మనకి ఓ సెంటిమెంటు కాదు వచ్చింది. ఇదే అమెరికా లాంటి చోట్లయితే ఇంత ట్రాష్ వుండదు. మనకి బ్రాహ్మణుడు కావాలి. ఇక్కడ కూడా ఎలక్ట్రికల్ పరికరాలొచ్చాయనుకోండి. అయినా మనం మారలేదు. అక్కడ డెడ్‌బాడీని తీసుకెళ్తారు. అయిదు నిముషాల్లో యాష్ మిగుల్తుంది. ఆ బూడిద తెచ్చుకొని నదిలో కలుపుతారు. అయిపోతుంది. మనుషులు మరణిస్తారు. బనా... వారితో అనుభవాలు, వారి కృషి ఇవి

మరణించవు కదా... మనవాళ్లు మనుషుల్ని మర్చిపోయి మిగతా కర్మకాండ సాగిస్తారు. అదే పిటీ సిగరెటు విసిరేస్తూ అన్నాడు.

నాకెందుకో ఆయనలా మాట్లాడుతుంటే వినాలనిపించింది. తిరిగి ఆయనే ప్రారంభించాడు.

"అయినా మరణం అంటే ఏమిటి? సైన్స్ యేం చెబుతుంది! మనం మరణించటం ఎప్పుడో ఆరంభమయింది. ఓ వయసు వచ్చేదాకనే మనలో జీవకణాలు సృష్టించబడేది. క్రమంగా ఒక్కో జీవకణం మరణిస్తుంది. చివరకా మెదడు పనిచేయటం ఆగిపోతుంది... అదేగా మరణం... సో... మనం ఈ ప్రాసెస్‌ను ఈజీగా తీసుకోవాలి."

నాకా క్షణము ఆయనో గొప్ప తత్త్వవేత్తలా గోచరించారు. స్వంత మనుష్యుల మరణాన్ని సైతం జీవన క్రమంలో భాగంగా చూడ గలగటం సాధారణ అంశం కాదు. నాకెందుకో నా మీద నాకే జాలేసింది.

ఉదయం నుండి నాలో మృత్యువును గురించిన ఆలోచనలే. ఓ కుటుంబం మొత్తం దుర్మరణం పాలయిన సంఘటన నన్నింకా కదిలిస్తునే ఉంది.

మృత్యువును గురించిన అన్ని కోణాలూ నాకింకా అర్థం కాక పోవచ్చు. లౌకిక ప్రపంచానికి చెందిన విషయాలే నన్ను ప్రభావితం చేస్తుండవచ్చు.

మరి నేను సైతం అంతటి ఉన్నత స్థితి కంటూ ఎదగగలనా?

శివ లోపల నుండి వచ్చాడు.

"ఏం బావగారు ఏం చేద్దాం" అడుగుతున్నాడు శివ.

"మీరో పని చెయ్యండి. ఓ వ్యాన్ మాట్లాడి డెడ్ బాడీని తీసుకు రండి"

"ఎక్కడికి?"

"ఎక్కడకేమిటి? బంజారాహిల్స్ దగ్గర స్మశానం ఉందిగా.... అక్కడకు రండి. ఈలోప్పు నేను బ్రాహ్మడ్ని మాట్లాడి మిగతా ఏర్పాట్లు చేస్తాను."

"అమ్మతో చెబుతా" నంటూ తిరిగి లోనకెళ్ళాడు శివ.

ఆయన మరో సిగరెట్ వెలిగించాడు. అయిదు నిముషాల తర్వాత శివ వచ్చాడు.

"సర్లేండి బావగారు" అన్నాడు.

"మరి నేను వెళ్తున్నా" అంటూ ఆయన బయలుదేరాడు.

"మీరు కూడా వస్తున్నారా" అనడిగాడు భార్గవని స్కూటర్ స్టార్ట్ చేశాక.

"అయ్యో! రాకుండా ఎలా ఉంటాను"

"ఇట్సాల్ రైట్" అని వెళ్ళిపోయాడాయన.

"భార్గవా... నువ్వు కొంచెం వ్యాన్ మాట్లాడాలి అందరూ డెడ్ బాడీస్‌ను అంగీకరించరు. మన వాళ్ళ స్కూటర్ తీసుకో."

"అలాగే" అంటూ భార్గవ స్కూటర్ తీసుకువెళ్ళాడు. శివ తన తండ్రి గురించిన జ్ఞాపకాల్ని వివరిస్తున్నాడు.

"జీవితం ఎంత చిత్రమైంది సోదరా! నిన్న రాత్రి దాకా బాగున్న మనిషి ఈ రోజు శవమైపోయాడు. రేపు స్మృతిగా మిగులుతాడు. కనీసం మరో అయిదు సంవత్సరాలు బతికితే ఎంత బాగుండేది. నా జీవితంలో ఇది మొదటి షాక్. ఇంత కాలం మృత్యువు ఇంత భయంకరమైనదని నాకు తెలియదు" శివ కంఠం బొంగురుపోయింది.

"ఊర్కో... జీవితానుభవాలెప్పుడూ ఒకే రకంగా ఉండవు. అన్నింటిని మనం భరించగలగాలి."

"యేం భరించటమో బ్రదర్... బతికున్నంత కాలం మనకు ఇల్లు కావాలంటూ ఆరాటపడేవాడు. ఆయనెందుకంతగా ఆరాటపడ్డాడో ఈ క్షణం అర్థమౌతుంది. నీకు తెలుసుగా నేను 'లోన్' తీసుకొని ఇల్లు కడుతున్నాను. మరో నెలలో గృహప్రవేశం చేయాల్సి ఉంది. ఇప్పుడు చూడు ఈ హైదరాబాదు నగరంలో ముప్పై సంవత్సరాలు పైబడి ఉన్నాడు. ఇక్కడే పని చేశాడు. ఈ పరిసరాల్తో బంధం పెంచుకున్నాడు. కానీ తాను చని పోయాక కొద్ది గంటలైనా ఈ గడ్డపై ఉండే అదృష్టం లేదాయనకు" అంటూనే దుఃఖం పొరలి రాగా ఏడ్చేశాడు.

ఎంత దారుణమైన నగ్నసత్యం. ఓ క్షణం నిలబడి ఆలోచిస్తే మనకే అర్థమౌతుంది. మనిషి జీవించి ఉన్నంత వరకే. మరణించాక ఎంత త్వరగా ఆ శవాన్ని వదిలించుకుందామా అనేంత తపన. ఏమిటి దంతా?!

భార్గవ స్కూటర్ వచ్చి ఆగింది. వెనకాల వ్యాన్ వచ్చింది. దాన్ని బ్యాక్ చేశాక శివ లోనకెళ్ళాడు.

"శివ వాళ్ళ బావగారు గొప్ప తత్వవేత్తలా ఉన్నారే" అన్నాను.

"అవును" భార్గవ నాకేసి చూసి నవ్వాడు.

"ఇప్పుడేం చేద్దాం" అన్నాను.

"నువ్వు కూడా రా. అంతగా అయితే మా రూమ్‌లో ఉందువు గాని"

మా అక్కగారిల్లు మలక్‌పేటలో ఉంది. బంజారాహిల్స్ నుండి ఈ తతంగం పూర్తయ్యాక, ఈ ముసురులో నాకు బస్సులు దొరకటం సందేహమే. పైగా రేపు ఉదయం నేను బయలుదేరి వెళ్ళాలి.

"శివ మనకు ప్రియమిత్రుడు. ఇక్కడున్న హిపోక్రసిలో ఓపెన్‌గా ఉండే వ్యక్తి. మనం పక్కనుంటే అతనికి ధైర్యంగా ఉంటుంది. నువ్వు కూడా వస్తే బాగుంటుంది. నిన్నెలా అయినా ఇంటికి చేర్చే బాధ్యత నాది" ఆలోచిస్తున్న నాకేసి చూస్తూ అన్నాడు.

"సరే అంతగా అయితే లీవ్ పెడతాను" అన్నాను.

స్ట్రెచర్ మీద శవం వస్తూంది. వెనగ్గా శివ అమ్మగారూ, అక్కలూ చెల్లి ఏడుస్తూ వస్తున్నారు. తిరిగి నా హృదయాన్ని ఎవరో నొక్కినట్లనిపించింది. నాకు తెలియకుండానే కళ్ళవెంట నీళ్ళు కారిపోతున్నాయి. శవాన్ని వ్యాన్‌లోకి చేరుస్తుండగా శివ తల్లి తల్లడిల్లిపోతూ "జాగ్రత్తగా బాబూ" అంది.

తన బిడ్డ రెండు చేతులూ పట్టుకొని

"శివా... స్మశానం దాకయినా ఆయన పక్కనుండ నివ్వండి. ఇన్ని సంవత్సరాలు ఆయనతో కలిసి ప్రయాణం చేశాను. ఆయన చివరి ప్రయాణంలో కొంత దూరం నన్నూ రానివ్వండి శివా" అంటూ బావురుమంది.

ఆమెనలా చూస్తున్న వారంతా కదిలిపోయారు. శివ కూడా బిగ్గరగా ఏడుస్తున్నాడు. వారిద్దరి దగ్గరకొచ్చి శివ చెల్లి ...

భార్గవ ముందు తేరుకొని శివను సముదాయించాడు. శవంతోపాటు శివ తల్లి ... చెల్లి కూర్చున్నారు. మరో రెండు టాక్సీల్లో మా ఆఫీస్ నుండి వచ్చిన వారూ, శివ తరపువారు బయలుదేరారు.

* * *

గాలి రివ్వున వేస్తుంది. సన్నగా చినుకులు పడుతున్నాయి. నేను మరో మిత్రుడి స్కూటరు వెనకాల కూర్చున్నాను. చలికి శరీరం వణుకుతుంది.

నగరపు చౌరస్తాల నుండి, మెత్తటి రోడ్డుల నడుమ నీటిని చీల్చు కుంటూ స్కూటరు పరుగెడుతుంది. ఓ వ్యక్తి తుది ప్రయాణానికి తోడుగా మేం సైతం కదిలి వెళ్తున్నాం.

స్మశానానికి కొంచెం ఇవతలగా వ్యాన్ ఆగింది. శివ తల్లిని, చెల్లిని దింపేశారు. దశాబ్దాలుగా తనతో జీవితాన్ని పంచుకున్న వ్యక్తికి వీడ్కోలు చెబుతూ ఆమె చేసిన రోదన మాకు శ్మశానం దాకా వినిపిస్తూనే ఉంది. ఆడవారంతా ఇంటికి వెళ్ళిపోయారు.

స్మశానం దగ్గర శివ బావగారు, ఆయనతోపాటు బ్రాహ్మణుడు వేచి ఉన్నారు. శవాన్ని దహనం చేయటానికి కట్టెలమోపు తయారుగా ఉంది. రెండు మంటపాలున్నాయి. అక్కడ యింకా తెల్లటి బూడిద మరకలు కనిపిస్తున్నాయి.

సన్నటి చినుకులు ఆగి ఆగి పడ్తున్నాయి.... కార్యక్రమం ఆరంభమైంది. మేం స్మశానపు గోడల దగ్గర నిలబడ్డాం.

అందరి చర్చల్లోనూ మృత్యువుకు చెందిన అంశమే ఇంకెంత మహా అయితే రెండు గంటలు. తిరిగి మరలా పాత ప్రపంచానికే... యాంత్రికత్వానికే... !

"సిగరెట్ ప్లీజ్" ఆఫరు చేస్తున్నారు శివ బావ.

నేను ఒకటి తీసుకున్నాను. ఆయన ముఖం యింకా మామూలుగానే ఉంది. ఎక్కడయినా విషాదకర ఛాయలు కనిపించగలవేమోనని వెతుక్కుంటున్నా...ఎందుకనో అసలా ఫీలింగ్సకనిపించలేదు. అది నాదృష్టి లోపమేమో నాకయితే తెలియదు. తిరిగి ఆయన ధారాళంగా మాట్లాడుతున్నాడు. వివిధ విషయాల గురించి.

ఏది ఏమైనా శవాన్ని ఎక్కువ సేపు ఉంచటానికి వీల్లేదు. పైగా రాత్రినుండి శరీరంలో ఉంది గ్లూకోజ్. శవాన్ని ఎక్కువసేపు ఉంచిన కొద్దీ, ఈ వాతావరణంలో కలరా సోకే ప్రమాదముంది.

సిగరెట్ అయిపోయింది. అయినే ఏవో విషయాలు మాట్లాడుతూనే ఉన్నాడు.

మేం లోపలకు నడిచాం. కట్టెలన్నింటిని పేర్చటం జరిగింది. శవాన్ని జాగ్రత్తగా దాని మీద పడుకోబెట్టారు. మేం కొంచెం దూరంగా నిలబడ్డాం. రెండు కట్టెల మీద కిరసనాయిలు పోసి వెలిగించారు. అవి గాలికి మండుతున్నాయి.

భార్గవ నా పక్కగా వచ్చి నిలబడ్డాడు.

"ఇదంతా కొత్తగా ఉందా ?" అన్నాడు.

"అవును. మరి నీకు ?"

"నేనిదివర్లో ఓ సారి చూశాను. ఇది నగరం కదా ! కొంత తేడా ఉంటుంది" అన్నాడు.

"ఏమైనా శివ బావగారు ఫాస్ట్ ఎలక్ట్రిక్ క్రిమిటోరియం అయితే బాగుండేదన్నారు".

తిరిగి భార్గవ నవ్వాడు.

'ఎందుకలా నవ్వుతావు... ఆయనన్న మాటల్లో నిజం లేదా ? ఈ నగరంలో చనిపోయినా వారందర్నీ పూడ్చడానికి ఎన్ని స్మశానాలు కావాలి? ఎంత వంట చెరకును మనం నాశనం చేస్తున్నాం. ఏదయినా మిగిలేది బూడిదే కదా!"

భార్గవ నాకేసి ఆశ్చర్యంగా చూశాడు.

"అది కాదోయ్. నాకీ పద్ధతుల మీద నమ్మకమేంలేదు. రెండోది ఎక్కడయినా పరిస్థితులే సంప్రదాయాల్ని మారుస్తుంటాయి. శివ బావ గారు ఫాస్టే కాదనను.కాని శివ నాతో అన్న ఒక్క విషయం నీకు చెప్పాలి

"ఏమిటది" అన్నాను అయోమయంగా

"శివ బావగారిక్కి స్వంత ఇల్లుండి తెలుసుగా"

"అవును"

బయటివారు శవాన్ని ఉంచటానికి అంగీకరించక పోవచ్చు. ఇంతగా ఎదిగిన ఆయన మృత్యువంటే సైన్స్ ప్రకారం జీవకణాలు మరణించటమే అని చెప్పిన ఆయన ఒక్కపూట శవాన్ని తన ఇంటి ముంగిట్లో ఉంచవచ్చుగా అని అగాడు.

నిజంగానే నాకు మతిపోయింది.

"మరెందుకు అలా చేయలేదు"

"ఆయనకూ అనేక సెంటిమెంట్లున్నాయి. శవాన్ని తమ ఇంటి ముందుంచితే తమకేం అశుభం జరుగుతుందోననే భయమే ఇంత త్వరగా వర్షంలో సైతం శవాన్ని దహనం చేయించటం"

నేను చాలాసేపు మాట్లాడలేక పోయాను.

నిజానికి ఈ ప్రపంచం ఎంత వైరుధ్యాల్తో నిండి ఉంది ఈ మానవులెంత పరస్పర విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. వీరిని అర్థం చేసుకోవటం సాధ్యమా !!

నేను ఆలోచనల్లో ఉండగానే బ్రాహ్మణుడొచ్చి నా చేతిలో బియ్యపు గింజ లుంచాడు.

"ఎందుకివి ?" అన్నాను.

"శవం నోట్లో ఉంచితే పుణ్యమట" అన్నాడు భార్గవ.

అప్పటికే ఒక్కొక్కరు వరుసగా శవం నోట్లో బియ్యపు గింజ లుంచి వెళ్తున్నారు.

నేనూ ముందుకు నడిచాను. కట్టెల మీద శవం నిశ్చలంగా వుంది. మృత్యువుకు చెందిన చివరి క్షణాన్ని నేను దర్శిస్తున్నాను. మరి కొద్ది సేపట్లో ఈ ప్రపంచంలో ఓ వ్యక్తి తాలూకు భౌతికమైనదేదీ మిగలదు.

నా చేతిలో వున్న బియ్యపు గింజల్ని శివనాన్నగారి నోట్లో ఉంచ బోతూ ఆయనకేసి చూశాను.

ఆ కళ్ళు నాకేసి తీవ్రంగా చూస్తున్నాయనిపించింది. అంతలోనే నన్ను చూసి నవ్వుతున్నట్లుగా....

నా చేతిలో నుండి గింజలు జారిపోయాయి.

బతికుండగా తోటి మానవుడి గురించి పట్టించుకోని మనం చని పోయిన వ్యక్తికి ఉపయోగం లేదని తెలిసీ....ఎందుకు? పుణ్యం కోసం! నేను వెనక్కి తిరిగి వచ్చాను.

శవానికి నిప్పంటించాడు శివ కుమిలిపోతూ .... అతన్ని ముందుకి నడిపించుకెళ్ళారు....

"కపాల మోక్షం" జరిగేదాకా మేం అక్కడే ఉండాలట.

"నాకిప్పుడు మరే ఇతర విషయాలు గుర్తుకు రావడం లేదు.

మన పురాణాల్లో మహాపురుషులు మృత్యువును తామే ఆహ్వానించు కున్నారు. అదెంత కల్పన అయినా జాగ్రత్తగా ఆలోచిస్తే ఎంత అద్భుత విషయం....!

మరణాన్ని చిరునవ్వుతో జయించిన అనేకమంది ఆధునిక కాలం లోనూ కనపడతారు. వాళ్ళు నిజమైన జ్ఞానులు....వారు సత్యాన్వేషులు....!

ఇంతకూ మరణాంతర జీవితం ఉంటుందా? మనిషి ఎప్పటికయినా మృత్యువును జయిస్తాడా? ఏమో .... కానీ ఆ మహాపురుషులు ప్రపంచం మృత్యువును జయించగలగుతుందనే ఆశకు ఊపిరి లాంటివారు.

మృత్యువును జయించటమా! ఎన్నన్నా చెప్పు అది అసాధ్యం" అన్నాడు భార్గవ.

"నిజమే కావచ్చు. కానీ ఓ విషయం గమనించు. మన పురాణాల్ని పరిశీలిస్తే మృత్యువును జయించాలనే కదా ఎన్నెన్ని తపస్సులు .... ఆరాటాలు....మన చరిత్రలో దేవతలంతా అమృతం తాగి చిరంజీవులే కదా! ఇప్పుడూ ఎక్కడో హిమాలయపు పర్వతాల్లో హనుమంతుడు జీవించి ఉన్నాడని మనం నమ్ముతున్నాం కదా! ఇవన్నీ మృత్యువును జయించాలనే మానవుడి ఆరాటానికి ప్రతీకలు కాదా?"

"నిజమే! మృత్యువు ఎంత బాధాకరమే అయినా అది అవసరం కూడా. మృత్యువు లేనిదాన్ని నేను ఊహించలేకపోతున్నాను. అసలు మృత్యువును జయించాలనే ఆలోచనే నాకెందుకో దురాశలా కన్పిస్తూంది" అన్నాడు భార్గవ.

"ఏమయినా భావించు. మృత్యువును జయించగలం అని చెప్పటం ఎంత పొరపాటో....మృత్యువును జయించలేం అని చెప్పటం కూడా అంతే పొరపాటవుతుంది. మానవుడు సాధించే అద్భుతాల్లో ఇది కూడ ఒకట ఎందుకు కాకూడదు?"

"కానీ ఇలా జనం పెరిగిపోతుంటే?"

"ఏమవుతుంది ?"

మృత్యువే లేని నాడు వీరందరిని తనలో ఇముడ్చుకోవటం ఈ భూమికి సాధ్యమా?

“ఇంక మరే గ్రహాలు లేవా? అలాంటి సమస్యే ఎదురైననాడు మానవుడు ప్రత్యామ్నాయం గురించి ఆలోచించి తీరతాడు” అన్నాను.

సన్నగా వర్షపు జల్లుపడుతూనే ఉంది. నగరంలో ఈ మూడురోజుల కాలాన్ని సమీక్షించుకుంటే నా కనిపించింది.

“మనం జీవించాలని క్షణ క్షణం ఆరాటపడుతున్నాం. మనం మరణిస్తున్నాం.... ప్రతిక్షణం మరణిస్తున్నాం. ఈ జీవితం....ఈ నాగరికత .... ఈ నగరాలు ఎంతగా మారిపోతున్నాయంటే “మృత్యువు”ను గురించి తెలుసుకోవాలని, మృత్యువును జయించాలని ఎందరో తాత్వికులయ్యారు.

కాని మనం పరిశోధించాల్సింది మరోటుంది....

మనం జయించాల్సింది ఇంకోటుంది....

ముందీ సమాజాన్ని, ముందీ మానవుల్ని, ముందీ వైరుధ్యాల్ని మనం విశ్లేషించుకున్న నాడు, మృత్యువంటే ఏమిటో .... మృత్యువుకు కారణం ఏమిటో బోధపడుతుంది.

మేం వెనక్కు తిరిగాం.

భార్గవా, నేనూ చివరకూ ఓ విషయంలో ఏకీభవించాం.

“ముందీ ప్రపంచాన్ని జయించ గలిగిననాడు మృత్యువు భయానకంగా ఉండదు. మృత్యువును ఓ మిత్రుడిలా ఆహ్వానించే స్థాయికి....అది సహజమే అని నిర్మలంగా గుర్తించే స్థితికి మానవుడు ఎదగాలన్నా ఈ సమాజం ఇలా ఉండకూడదు.

మానవుడు ఎదిగే రోజు వస్తుంది!

ఏదో ఒకనాడు ‘మృత్యువనేది’ పాతబడ్డ మరచిపోయిన పదంలా కాలం పుటల్లో మిగిలిపోతుంది!